# వెర్రి కో పుర్రి

" ఓటరు మహాశయులారా ! మీ అమూల్యమైన ఓటు నాకే వేయండి.. " పరంధామయ్య ఉపన్యాసం ఇవ్వడం మొదలెట్టాడు.

"అదీ సంగతి .... కిందటి సారి ఎలక్షన్లో నేను ఓటును నాకి వెయ్యలేదు - అందుకే నేను ఓటేసినతను ఓడిపోయాడు పాపం !" పాపారావు గుర్తు చేసుకున్నాడు.

"ష్ ! ఇలా మధ్యలో అడ్డొస్తే .. నేను చెప్పదల్చుకున్నది మర్చి పోతాను అసలే నా సమయం అమూల్యమైంది. మీ దరిద్రపు మొహాలు చూడ్డానికి రాలేదు మీ వెధవ కోరికలు వినడానికి రాలేదు. మీ బోడి సమస్యలు తీర్చడానికి రాలేదు."ఆయసంతో ఆగాడు.

"మరి ఎందుకొచ్చినట్టు ? " మందు బాబు మాధవరావుకు అనుమానం రానే వచ్చింది.

"వెధవది ... మన రాజ్యాంగంలో అప్పుడప్పుడు ఎన్నికలుజరుపమని రాసుంది. నేను ఎన్నికై పి.యమ్ కాగానే మీ సౌకర్యార్థం ముందు ఆ క్లాజును చించిపారేస్తాను - అని హామీ యిస్తున్నాను" చెప్పాడు పరంధామయ్య.

"హియర్ ! హియర్ ! " చప్పట్లు మారు మ్రోగాయి.

" అట్లాగే ఇంకా చాలా సంస్కరణలు చేస్తాను. ముఖ్యంగా ఎలక్షన్ కమీషన్ను పీకి పారేస్తాను అనవసరంగా దానికోసం బోల్డు ఖర్చవుతున్నది. ఆ డబ్బును బార్లు ఓపెన్ చేయడానికి మళ్లిస్తాను"

" బార్లు ఓపెన్ చేస్తావా ? కుదర్దు- అవి ప్రైవేట్ మేనేజిమెంట్ చేతుల్లో ఉన్నాయి ఇప్పటిదాకా. దాన్ని ప్రభుత్వ పరం చేశావంటే ... మాకున్న ఆ ఒక్క మనశ్శాంతి పోతుంది. బారు జోలికి వచ్చావంటే నీ వీపు పేలి పోతుంది. జాగ్రత్త !" మాధవరావు హెచ్చరించాడు.

" వాటీజ్ దిస్ ! గాంధీ పుట్టిన దేశంలో బ్రాందీని చక్కగా పంపిణీ చేయకపోతే ప్రపంచ దేశాలు ఏమనుకుంటాయి ? ఛీ ! కల్తీ సారాలు ఎన్నాళ్లు తాగి చస్తారు ? ఈ

ఇరవయ్యోకటవ శతాబ్దంలో కూడా నాటేనా ? పూటుగా విదేశీ మద్యాన్ని దిగుమతి చేసుకొని - తాగి చావండి... " పరంధామయ్య కోప్పడ్డాడు.

కొందరు బుద్ధిమంతులు మాధవరావును నోరు మెదప కుండా చేతులతో నోరు మూసేశారు.

"పరంధామయ్య గారు ! మీరు పి.యమ్ అయితేరుణాలు మా మామూలు సాదా సీదా ప్రజలకు పంచి పెడతారా ? కాస్త చే బదులు ? జస్టు టెంపరరీ అడ్జస్టు మెంట్ ? "అప్పారావు అర్థించాడు.

" మా ప్రభుత్వం ఉన్నదే అందుకు కదయ్యా ! కాకపోతే నీకు రుణం ఇచ్చిందానికి కాస్త భారీగా....."

"దారుణం - రుణానికి లంచమా ?" అప్పారావు అరిచాడు.

"లంచమా ? ఛీ ! ఛీ ! మామూలయ్యా ! జస్టు నీకు నలభై శాతం - మాకు అరవై శాతం!"

"అన్యాయం - నూటికి అరవై ఇచ్చి మేం బాపుకునేదేముంది - బాప్‌రే !" అప్పారావు వాపోయాడు.

" నీ మొహం మండ ! మీరింత అగ్నానంలో ఉన్నారు కాబట్టే మనదేశం ముందుకు వెళ్లడం లేదు. రుణం తీర్చమని నిన్నెవరు అడిగారయ్య బాబు ! ఓరెండేళ్ల తర్వాత సాఫీగా మాఫీ చేసే ఏర్పాటు మేమే చూస్తం గదా ! అందుకే ... మీ ఓట్లన్నీ కట్ట కట్టి నాకే వెయ్యమని మరీమరీ కోరుతున్నాను. " పరంధామయ్య కూర్చున్నాడు.

"పరంధామయ్య జిందాబాద్" అప్పారావు అరిచాడు.

" జిందా బాద్ !" మాధవరావు వంత పాడాడు.

ఆ తర్వాత శనీశ్వరావు గబుక్కున మైకును అందుకున్నాడు. భీమారావు ఆ మైకు కోసం ఎగబడితే అతగాడ్ని డొక్కలో ఒక్కపోటు పొడిచాడు. దాంతో భీమారావు తోక ముడిచి కుర్చీలో కూర్చున్నాడు.

శనీశ్వరావు గళం విప్పాడు.

"సోదర సోదరీమణులారా ! నాపేరు శనీశ్వరావు అని పరిచయం చేసుకోవడానికి గర్విస్తున్నాను. ఎందుకు అంటే నా బొమ్మలు ఎన్నో చూసుంటారు. నాపేరు ఎన్నో సార్లు జపించి ఉంటారు కాని నా అవతారం మటుకు నేడే వీక్షించి ఉంటారు".

" ఆపవయ్యా బాబు – నీ సోది – విషయంలోకి రా !" భీమారావు విసుకున్నాడు.

" నే చెప్పేదేమంటే తెలుగు వాడికి అంతర్జాతీయ ఖ్యాతి నార్జించి పెట్టాను అంతకు ముందు అస్సలు తెలుగు అనే భాష ఉందని – దానిలో కూడా సిన్మాలు తెగ తీస్తారని – ప్రపంచానికి తెలీదు కానీ నాపాదం మోపాను – ఆంధ్ర దేశాన్ని ఉర్రూతలూగించాను. ఆస్కార్ అవార్డుకు అర్రులు చాచాను. అస్సలు నాగురించి నేను చెప్పకూడదు. షేక్స్పియరుకు అంతపేరు ఎందుకొచ్చింది ?" మొహం ప్రశ్నార్థకంగా పెట్టాడు శనీశ్వరావు .

" నాటకాలు వేసిందానికి " చెప్పాడు భీమారావు

"నో – నో ఆయన నాటకాలు వెయ్యచ్చు – రాయచ్చు – ఆడచ్చు – కాని పేరు వచ్చింది మటుకు – అందుకు కాదు... మీలాంటి కుశాగ్ర బుద్దులు ఆయన నాటకాలను ఔపోసం పట్టి ..... వాటిల్లోని రసాలను బయటకు లాగి ప్రపంచానికి తినిపించారు. లేకపోతే షేక్స్పియరు కూడా డిసప్పియరు అయ్యే వాడే ! అలాగే నా సినిమాలను చూసి మెచ్చుకున్న మీరు లేకుంటే .... నా పేరు ప్రపంచానికి తెలిసేది కాదు. మన తెలుగువాడి వాడి వేడి ప్రపంచానికి తెలిసేది కాదు". శనీశ్వరావు చెప్పుకు పోతున్నాడు.

మందు బాబు మాధవరావుకు ఒక డౌటొచ్చింది. "ఆపు – ఆపు – మధన పేపర్లో చదివాను – నీ సినిమాలన్నీ కాఫీలట గదాః" అడిగాడు.

" కాకపోతే ఒరిజనలని ఎవరు చెప్పారు " మాట జారాడు ... తర్వాత తనతప్పు తెల్సింది – ఆ మూర్ఖులకు ఎలా నచ్చ చెప్పాలని ఆలోచించాడు..

" – ముందుగా ఒరిజనల్ తీస్తాం – ఆ తర్వాత సువిశాల ఆంధ్రప్రదేశంలోని అన్ని థియేటర్లకు దాని కాపీలు తీసి పంపుతాం – అందుకని మీరు చూసేది కాపీనే – ఒరిజనల్ కాదు – అండర్‌స్టాండ్?" శనీశ్వరావు దబాయించాడు.

" మరి ఆ పేపరోళ్లు అలా రాస్తారేంటి – ఫలానా ఫలానా పిక్చరుకు అనువాదం అని అనుసరణ అని ... " అప్పారావు కు ఇంకా అనుమానం పోలేదు.

"ష్ ! మీకో దేవరహస్యం చెప్పనా ? ఈ సృష్టిలో ఏదీ మన సొంతం లేదు. నవ్వు మాట్లాడే భాషనీది కాదు. నువ్వు కట్టుకునే దుస్తులు నీవి కావు – నీ జేబులో డబ్బు నీది కాదు– నీ యిష్టాలు నీవి కావు – నీ జీవితం నీది కాదు – ఆఖరికి నువ్వు మోస్తున్న శరీరం నీది కాదు – ఇంకా చెప్పాలంటే – నువ్వు వేసే ఓటు నీది కాదు – నువ్వు ఎన్నుకునే అభ్యర్థి నీ వాడు కాదు – నువ్వు చేసే సంసారం నీది కాదు – ఇన్ని నీవి కానప్పుడు నే తీసే సినిమా నాది కాక పోతే మటుకు నష్టం ఏమిటి అని బల్ల గుద్ది అడుగుతున్నాను". శనీశ్వరావు లా పాయింట్ పట్టేశాడు.

దాంతో అందరూ గమ్మునై పోయారు.

"ఇంక చాల్లే– ఏం మాట్లాడతావు గాని – కూర్చో !" ఓ మొట్టి కాయ వేసి ఆతడి చేతుల్లోంచి మైకు గుంజుకున్నాడు భీమారావు కుయ్యో మొర్రో అంటూ శనీశ్వరావు కూర్చున్నాడు.

భీమారావు గొంతు సవరించుకున్నాడు.

"డియర్ ఫ్రండ్స్ ! తొందరలోనే నేనొక పబ్లిక్ ఇష్యూ జారీ చేయబోతున్నాను. దాని విలువ వందకోట్లు ."

" నీబొంద – ఎందుకు – దండగ ?" శనీశ్వరావు అన్నాడు.

" గొప్ప ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్ బిజినెస్ పెట్టబోతున్నాను . దాంతో మనదేశానికి అమెరికాలో నే కాక యావత్ ప్రపంచంలో గొప్ప పేరు తెచ్చి పెట్టబోతున్నాను". భీమారావు విజృంభించబోతున్నాడు.

" ఆపు – ఆపు – బిజినెస్ పెట్టడానికి నీకున్న అనుభవం ఏమిటి? వందకోట్లు

నీ మొహం చూసి ఎవరు కొంటారు ?" మాధవరావు మొహాన అడిగేశాడు.

"వాటీజ్ దిస్ ! నేనిప్పటికి పది కంపెనీలకు జి.యమ్ గా , యం.డి.గా పని చేశాను - తెల్సా?"

"ఆ ! ఎందుకు తెలీదు - ఆ పది దివాళా తీశాయిగా -వేలాది మంది కార్మికులు -వాళ్ల వాళ్ళ కుటుంబాలు వీధిన పడ్డాయి... నీ పుణ్యమాని - చాలామంది ఆత్మహత్య చేసుకున్నారు. ప్రజల్ని ముంచింది చాల్లేదా - మళ్లీ ఇంకో కంపెనీ పెట్టి దోచుకు బోతున్నావా దొంగ రాస్కెల్ !" మాధవరావుకు కోపం వచ్చేసింది మరి.

"అదేంటి - పది కంపెనీలు నామూలంగానే దివాలాతీశాయా ? జీతాలు తినమరిగి - కార్మికులు పని చెయ్యకుండా చీట్లాటలు - పోట్లాటలు ఆడుకుంటే ఏమవుతుంది ? సంవత్సరాని కొకసారి జీతాలు పెంచాలి - ఆర్నెల్ల కొకసారి ఇంక్రిమెంటివ్వాలి - పాతిక శాతం బోనసు - ఇంకా ఏ కంపెనీ దివాళా తియ్యదు నాకు తెలీక అడుగుతా ?" భీమారావు గర్జించాడు .

" అదేం కాదు -- లాభాలన్నీ దిగమింగి ... నీకొడుకుల పేరుమీద- కూతుళ్ల పేరు మీద - అల్లుళ్ల పేరు మీద - బావమరుదుల పేరు మీద ఆస్తులు కొనుక్కున్నావు. కంపెనీకి నష్టాలు చూపించి గవర్నమెంటుకు అంటగట్టావు. నీ ఒక్క బోడి పొట్ట కోసం వేల మంది పొట్టల మీద కొట్టావురా ఈడియట్ ! " అప్పారావు అరిచి చెప్పాడు.

"ప్రజలరా ! పిచ్చివాళ్లు ఏదో వాగుతూ ఉంటారు పట్టించు కోకండి - నా వంద కోట్ల పబ్లిక్ యిష్యూ కొనండి ఆలోశించిన ఆశాభంగం ! అప్పుడే మార్కెట్లో పదిరూపాయల షేరు ఇరవైకి అమ్ముడు బోతుందని పుకార్లు షికార్లు చేస్తున్నాయి - తెల్సా? భీమారావు చెప్పాడు.

" నీ బొంద ! ఈ సారి నిన్ను నమ్మి నీ బోడి షేర్లు ఎవరు కొంటారు - షేర్ల కుంభకోణంలో వందల కోట్లు దిగమింగిన అనుభవం ప్రజలు మర్చి పోయారను కున్నావా ?" శనీశ్వరావు తన అభిప్రాయం చెప్పాడు.

" హు ! ప్రజలకు జ్ఞాపకశక్తి చాలా తక్కువ వాళ్లకి నా గత చరిత్ర తెలియదు

తెల్సినా పట్టించుకోరు - మీరు చెప్పినా వినరు. వాళ్ళకి కావాల్సింది వీలైనంత తక్కువ పెట్టుబడితో వీలైనంత తక్కువ టైములో వీలైనంత కోటీశ్వరులు అయిపోవాలని, కనుక వాళ్ళ ఆశే వాళ్లను మోసం చేస్తుంది. నేను కాదు నేను కేవలం నిమిత్త మాత్రుడ్నే!" భీమారావు శనేశ్వరావు కాలరు పట్టుకొని అర్థమయ్యేట్లు చెప్పాడు.

ఇంతలో భుజంగరావు రివ్వున వచ్చి అతని చేతుల్లోంచి మైకు ఊడ బెరికి - అతన్ని కుర్చీలోంచి లాగేసి తను కూర్చొని మాట్లాడ్డం మొదలెట్టాడు.

" వాటీజ్‌దిస్ ! షేర్లట షేర్లు ! షేమ్ షేమ్ ! ప్రజలు తిండానికి తిండి లేక ఛస్తుంటే షేర్లు అమ్ముతారట ! శవాలపై డబ్బులు ఏరుకునే వెధవలు వీళ్లు ! అసలు షేర్లది ఏ కులం ?ఏ మతం?
షేర్లది ఏ భాష? అని ఎవరూ అడగరేం ? అలా వాజమ్మ మొహాలు వేసుకుని చూస్తారేం? షేర్లకు లేదు కులం - షేర్లకు లేదు మతం - షేర్లకు లేదు భాష ! కాని ఆ షేర్లు కొనే మనకు మటుకు కావాలి - మతం - కులం - భాష ! భేష్ ! ఓ మనిషి తిరిగి చూడు! ఈ గాలిది ఏ కులం ? ఈ నిప్పుది ఏ మతం ? ఈ ఆ కాశంది ఏ భాష ?" ఆవేశంగా చెప్పుకు పోతున్నాడు.

"వ్వా వ్వా వ్వా ! బహుత్ అచ్ఛాహై !ఆప్ ఆంధ్రా హై !క్యా కమ్మాహై ఆప్‌కీ భాషకీ !" సలీం సలాం కొట్టాడు.

" వద్దు - వద్దు - నన్ను మెచ్చుకోవద్దు - ఈ జ్ఞానం నాకు ఇప్పుడు కలిగింది - అది అప్పుడే కలిగితే నా వింధ్యను రక్షించుకొనే వాడిని వింధ్యా ! వింధ్యా!" ఏడుస్తూ కన్నీళ్లు తుడుచుకున్నాడు.

" అరే ! వింధ్య వింధ్య అంటే మాకేం తెలుస్తుంది? ఏం జరిగిందో చెప్పు" మాధవరావు అరిచాడు.

" నాచిట్టి కూతురు వింధ్య ఓ కులం కాని వాడ్ని ప్రేమించింది... అతనిది మా మతం కాదు ... అందుకే నా సమ్మతి లభించలేదు..."

ఆ ! అయితే వింధ్య లేచిపోయిందా ? మంచి పని చేసింది.... ఎక్కడోక్కడ

సుఖంగా నే ఉంటుంది!" అప్పారావు ఆశీర్వదిస్తూ అన్నాడు.

" లేదు - ఫ్యానుకు ఉరేసుకుని చచ్చిపోయింది." నాన్నా - నీ పరువు కోసం - నీ కోసం నేను ఛస్తున్నా అని రాసి మరీ చచ్చింది - అది చచ్చి నన్ను చంపుతున్నది ఏడ్చేశాడు.

" పోనీలే - నీలాంటి వాడి కూతురు గా పుట్టడం కంటే చావడమే మేలు " మాధవరావు అన్నాడు.

" సైలెంట్ ఏంటీ కాకి గోల !" ఆ కేక వచ్చిన వైపు అందరూ తల తిప్పి చూశారు. కొందరు వేదిక మీంచి కిందికి దూకారు గుమ్మంలో డాక్టర్ శంభులింగం నిలబడి ఉన్నాడు.

అందరూ ఒక్కసారి నిశ్శబ్దంగా ఉండి పోయారు.

"రోజు రోజుకు మీ అగడాలు ఎక్కువై పోతున్నాయి. ఇక్కడ నే ఒకడ్ని ఉన్నానన్న జ్ఞానం లేకుండా మీలో మీరు అరుచుకోవడాలు, తిట్టుకోవడాలు - కొట్టుకోవడాలు చేస్తున్నారు. నో - నో- ఐ కాంట్ టాలరేట్ ! రేపు మిమ్మల్నందర్ని పంపించేస్తాను ".

"సారీ ! సార్ ! అంత పని చెయ్యకండి సార్ ! " అందరూ ఏడ్పు లంఘించుకున్నారు.

"సరే ! ఏడ్వకండి - నాకేడ్పు వస్తున్నది... చిన్న సవరణ ! ఫీజులు సరిగ్గా కట్టని వాళ్లను పంపించేస్తాను... మీ అందర్ని పోషించడానికి ఇదేం ధర్మ సత్రం కాదు.... డబ్బు - డబ్బు కావాలి... డబ్బులోనే ఉంది సర్వం జగత్తు ! అండర్‌స్టాండ్! ఐ వాంట్ మనీ !"

"సార్ ! డబ్బు డబ్బు అని ప్రతి నెలా దోచుకుంటున్నారు - ఇలా ఎన్నాళ్లు చేస్తారు సార్!" అప్పారావు అడిగాడు వినయంగా పేషెంటును పట్టుకుంటే ఐదొందలు - వెయ్యి గుంజి మత్తు మందులు రాస్తారే - కనీసంబీద బిక్కి అన్న భేదం లేదు. అందరి దగ్గరా ముక్కు పిండి మరీ వసూలు చేస్తారే - మరి మీ జబ్బుని మేం ఏమని

పిలవాలి డాక్టర్?" అప్పారావు నిలేశాడు. ఇంతలోనే కోపం ఎగదన్ను కొచ్చింది అతనికి - మరి.

ఛీ ! మీ పిచ్చి తగ్గే దాకా తప్పదు. నేను ఎంత కష్టపడుతున్నానో తెల్సా - మీ బోడి డబ్బిచ్చినా మీకు సేవలందించేది ఎవడు ఈ లోకంలో ? నేను కాబట్టి- ఏదో డబ్బుకు గడ్డి తిని -" డాక్టర్ శంభులింగం చెప్పాడు.

" సార్ ! పిచ్చి మాకు కాదు సార్ ! మీకు - మీకు డబ్బు పిచ్చి ! మా పిచ్చిని కుదిర్చేందుకు

మీరున్నారు - మాకు కనీసం రేపన్నా తగ్గుతుంది. కాని మీకు పట్టిన పిచ్చిని కుదిర్చేందుకు ఏ డాక్టరు లేడు ! ఆ పిచ్చి ఎప్పటికీ తగ్గదు. ఈ లోకంలో అన్ని పిచ్చిలకు మందుంది కాని డబ్బు పిచ్చికి మటుకు మందులేదు సార్ - మందులేదు". మందు బాబు మాధవరావు తెగ బాధపడిపోతూ చెప్పాడు.

"పవిత్రమైన వైద్యాన్ని వ్యాపారంగా మార్చి వేశారు మీ డాక్టర్లు. అవసరం లేని టెస్టులు రాసేది, భయపెట్టి పనికి రాని ఆపరేషన్లు చేసేది, అనవసరమైన మందులు ఇచ్చేది - ప్రతి దాంట్లో కమీషన్లు మేసేది - ప్రాక్టీసు పెట్టిన వెంటనే కోటీశ్వరులు అయిపోవాలని ప్రజల్ని బలిపశువులు చేసేది - బాగు పడండి సార్ - కార్లు కొనుక్కోండి - మేడలు కట్టండి - కాని మీ చేతిలో పడ్డ బీద పేషెంట్లు మటుకు ఇళ్లు - ఆస్తులు అమ్ముకొని వీధిన పడుతున్నారు. కొందరు అడుక్కుతింటున్నారు - ఈ పాపం ఊరికే పోదు సార్ ! నాశనమై పోతారు" అప్పారావు ఆవేశపడి పోతున్నాడు.

"నర్స్ ! వీడికి పిచ్చి బాగా ముదిరి పోయింది. షాక్ ట్రీట్‌మెంట్ రెడీ చేయండి". శంభులింగం ఆదేశించాడు.

"పిచ్చి డాక్టర్ శంభులింగం డౌన్ డౌన్ " కేకలతో అందరూ కోరస్ కలిపారు.